# నీరో అంతరంగం


'ద్వారకా'

మల్లె పూవులా మెరిసిపోయే పొందూరు ఖద్దరు ఎం.ఎల్.ఏ. జరీబార్డరు పంచ కట్టుకొని, వదులుగా ఉండే జుబ్బా వేసుకొని, జరీఅంచు కండువా భుజాన మెరుస్తూ ఉండగా, కాళ్ళకు బూట్లు, కళ్ళకు అద్దాలు ధరించి వాకింగ్ స్టిక్ ఊపుకుంటూ ఆయన వీథిలో నడుస్తుంటే ఉట్టిపడే హుందాతనం. రాజసం చూడాల్సిందే గాని మాటల్లో చెప్పలేము.

విశ్వాసపాత్రులయిన సేవకులు ఆయన వెంట పరుగులు దీస్తుంటారు— ఏ క్షణంలో ఏ మాజ్ఞాపిస్తారోనని ఎదురు జూస్తూ.

ఏదో పెద్ద పని ఉంటే తప్ప బయటికి రారాయన.

ఉదయం ఎనిమిది గంటలకల్లా కాలకృత్యాలు ముగించుకొని హాల్లో పేము కుర్చీలో జారగిలబడి



కాలుమీద కాలేసుకొని కూచొని పేపరు చదువుతూ దర్శనమిస్తారు అర్జునరావుగారు. అంతకు ముందే ఆయన్ను చూడాలంటే ఇండియా ప్రెసిడెంటుక్కూడా సాధ్యంకాదు.

తమ బాధామయ గాథలు చెప్పుకొని ఊరట పొందేందుకు ఎందరో ప్రజలు ఆయన దగ్గర కొస్తూవుంటారు. ఎవరి రాకపోకల్నీ పట్టించుకోరు అర్జునరావుగారు. పేపరు చదవటంలో లీనమయి వుంటారు. మధ్య మధ్యలో అవసరం కొద్దీ లోపలికి పోయి వస్తూవుంటారు.

వచ్చే వారు తమ తమ అంతస్థులను, హోదా

ఎం.ఎల్.ఏ. [illegible] అలంకరణాలు, అధునాతమైన వేను.

అర్జునరావుగార్ని చూడాలనీ, ఆయనతో ఏకాంతంగా మాట్లాడి నా ఇబ్బందిని చెప్పుకొని సాయం చెయ్యమని కోరాలనీ ఎన్నో సార్లు ప్రయత్నించాను. ఆయన ఊళ్ళో ఉండేదే చాలా అరుదుగా. ఉన్నప్పుడు తీర్థ ప్రజలా వస్తూంటారు జనం ఆయన దగ్గరికి.

అర్జునరావుగారి వయస్సు యాభై సంవత్సరాలకుపైనే ఉంటుంది. జుట్టంతా తెల్లబడిపోయింది. పచ్చటి పసిమిఛాయ శరీరం. మెలితిరిగిన బుర్రమీసాలు. మెరిసే కళ్ళు. పొడుగాటి పెద్దముక్కు. విశాలమైన ఫాలభాగం. గుబురుగా పెరిగిన కనుబొమలు. ఆరడుగుల భారీ శరీరం ఆయనది.

[illegible] సాష్టాంగ ప్రణామాలు. నిలువుదణ్ణాలు. గుడ్‌మార్నింగ్ [illegible]లు. బాగున్నారా అనే పలకరింపులు సమర్పించుకుంటూ తాము వచ్చినట్లు తెలివిడి చేసుకొని, మూలలకతుక్కునే వారు మూలల్లో, గోడలకు చేరబడే వారు గోడలకు, బెంచీల వారు బెంచీలమీద, కుర్చీల వారు కుర్చీలమీద, సుఖాసీనులవుతారు.

వచ్చిన వారు తామాక్రమించుకున్న స్థానాల్లోంచే వివిధ భంగిమల్లో గోడు చెప్పుకుంటారు.

ఎంత సేపూ ఎవరి బాధలు వారు పడాల్సిందే గాని అర్జునరావుగారి నుండి చిరునవ్వులు గాని, పలకరింపులుగాని, ప్రత్యభివాదాలు గాని, నామమాత్రంగానయినా ఉండవు. సమాధి స్థితిలో ఉన్న యోగిలా పేపర్లో మునిగిపోయి ఉంటారు. తాము చెప్పదలుచుకున్న దంతా చెప్పిం తరువాత, విన్నపాలు వివరించుకోవటం ముగిసింతరువాత-స్వామి వారి సన్నిధిలో ఇంత సేపున్నాం చాలునని తృప్తి చెందిన తరువాత-వచ్చిన వారు ఒదిగి ఒదిగి నమస్కారాలు పెడుతూ వచ్చిన త్రోవపడతారు.

పోయే వారు పోతూ ఉంటే వచ్చే వారు వస్తూ ఉంటారు.

ఇలా ఉదయం ఎనిమిది నుండి మధ్యాహ్నం పన్నెండు గంటలదాకా, సాయంత్రం ఆరు నుండి ఎనిమిది గంటలదాకా జరుగుతూ ఉంటుంది. ఆ మధ్య కాలంలో అర్జునరావుగారికి భోజనము, విశ్రాంతి, నిద్ర, తదితరాలు.

ఉదయం, సాయంత్రం రెండు పూటలా వచ్చీపోయే జనం మారుతుంటారుగాని అర్జునరావుగారిలో మాత్రం ఏ మార్పూ ఉండదు. ఉదయం వార్తా పత్రికలో మునిగితే సాయంత్రం రకరకాల వార పత్రికలు అడ్డం పెట్టుకునే వారు.

అప్పుడప్పుడు సిగరెట్టు కాల్చటం తప్ప మరే దురలవాటు లేదు నాకు తెలిసి అర్జునరావుగారికి.

అర్జునరావుగారి నిర్లక్ష్యాన్ని గురించి ప్రజలు రకరకాలైన వ్యాఖ్యానాలు చేస్తున్నారు దూరంగా ఉన్నప్పుడు. స్వార్థపరుడు. అసమర్థుడు దగ్గర మొదలై వచ్చి బూతులదాకా పోతూ ఉంటాయి వారి విమర్శలు. వారి మాటలు నిజమని నమ్మామంటే మనం ఫూల్స్ అవుతున్నా మన్నమాట. ఎందుకంటే నిన్న మహాగట్టిగా తిట్టిన, వాడు ఇవాళ ఆయనకు మరికాస్త దగ్గరగా జరిగి ఆయన్ను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం ఘనంగా చేస్తాడు.

అర్జునరావుగారు ఊళ్ళో ఉన్నన్ని రోజులు ఇదే తంతు! ఆయన ఊళ్ళు తిరగాల్సిన పనిలేదు. ఊళ్ళే ఆయన దగ్గరికొస్తాయి!

అర్జునరావు గారు అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు రాజధానీ నగరానికి చాలా అట్టహాసంగా బయల్దేరేవారు. భోషాణాల్లాంటి సూట్‌కేసులు నాలుగైదు. పళ్ళబుట్టలు కొన్ని కారుడిక్కీలో. టాపుమీద దట్టించుకొని. మందీమార్బలంతో బయలుదేరేవారు. ఆ దృశ్యం చూస్తూ ఉంటే శాంతారాం గారి 'దహేజ్' చిత్రంలో పృధ్వీరాజ్‌కపూర్ గారు తండ్రి వేషంలో క్రొత్తగా పెళ్ళి చేసిన కూతుర్ని అత్తగారింటికి పంపుతూ సర్వాలంకరణాలను మహా ఆడంబరంగా ఆవిడతోపాటు ఊరేగింపుగా తీసుకుపోయే దృశ్యం కళ్ళక్కడుతుంది.

అర్జునరావు గారు ఊళ్ళో లేనప్పుడు ఊరు బోసిపోతుంది. ఆ భవనం పాడుబడినట్లు టుంది. ఆ ఇంటికి, ఊరికి గూడా ఆయనతోనే వైభవం.

* * *

ఎన్నిసార్లు ప్రయత్నించినా అర్జునరావు గారు వంటరిగా దొరకలేదు నాకు. నే నో పెద్ద సమస్యలో చిక్కుకున్నాను..డబ్బుతో ఆ సమస్యలోంచి బయటపడవచ్చు. కాని నా దగ్గర లేని పదార్థం అదే! ఎం.ఎల్.ఏ. అర్జునరావు గారు నామీద దయతలచి నన్ను ఒడ్డున పడేస్తారేమోననే ఆశతో ఆయన చుట్టూ తిరుగుతున్నాను అందరితోబాటు.

ఆయనకు చిరపరిచితులైనవాళ్ళు, పెద్దపెద్ద హోదాలవాళ్ళు, ఎన్నికల్లో ఓటేయించిన వాళ్ళు, ఎవరిమటుకు వాళ్ళు విన్నపాలు చేసుకోటాలేగాని అర్జునరావు గారిలో ఎటువంటి ప్రతిస్పందనా కలిగించలేక పోతూండటం కళ్ళారా చూస్తున్నాను. అంతవారట్లవుతున్నారు-మనమనగా నెంత వారము-అన్న భావంతో నా చిక్కుముడిని ఆయన ముందుంచే సాహసం చెయ్యలేక పోతున్నాన్నేను.

అందరితో పాటు నేనూ అనేకసార్లు ఆయన బంగళా చుట్టూ ప్రదక్షిణలు చేశాను ఉదయం. సాయంత్రం గూడా క్రమం తప్పకుండా. ఏం ప్రయోజనం కలగలేదు.

నా సమస్య చాలా తీవ్రమైంది. తక్షణ పరిష్కారం కోసం తహతహ లాడుతున్నాను. ఎంతమంది దగ్గరికెళ్ళి ప్రాధేయపడినా డబ్బులేందే ప్రయోజనం లేదు పొమ్మన్నారు. గత్యంతరంలేని పరిస్థితుల్లో అర్జునరావు గారిమీద ఆశలు పెట్టుకున్నాను. ఆయన దర్శనం లభిస్తున్నది గాని ఆయనతో నా విషయం మొరబెట్టుకునే వీలు దొరకటం లేదు.



అర్జునరావు గారిమీద. ఆయన్ను చూడవస్తున్న జనసందోహం మీద నాకు విపరీతమైన చిరాకు. కోపం వస్తున్నాయి. అయినా ఏం చెయ్యగలను? పేదవాడి కోపం ......లాంటి సూత్రాలు మన పెద్దలు ఏనాడో మనవాళ్ళకు. మనకు ఒంటబట్టించే పోయారు. వారి మాటలు. ఉపదేశాలు. ఏవి ఒంటబట్టినా పట్టకపోయినా ఇలాంటి సూత్రాలు మాత్రం మన్ని కొత్తిపాటి రక్తంలో కలిసిపోయి పరంపరగా ప్రవహిస్తున్నాయి. మనల్ని పాలింపజేస్తున్నాయి.

నాకంటె చదువుసంధ్యల వాసన తెలీని పల్లెజనం మేలు. చెప్పదలుచుకున్నదేదో నిర్మొహమాటంగా, ఆయన వినటం వినకపోవటంతో నిమిత్తం లేకుండా చెప్పేసి పోతున్నారు. సంస్కారం పేరుతో పిరికి ముసుగేసు కూర్చుంటున్నాన్నేను! నామీద నాకు కోపం వస్తున్నది...నా సహనం నశించింది.

ఒకరోజు రాత్రి ఎనిమిదిగంటలు దాటిపోయినా అర్జునరావు గారి సముఖంలోనే తిష్ఠవేసుకొని ఉండిపోయాను.

ఎనిమిది గంటలయ్యేసరికి అందరూ వెళ్ళిపోయారు. (దర్శనవేళలు అర్జునరావు గారే ఏర్పాటు చేశారో లేక ప్రజలే ఆ వేళలను అలవాటుప్రకారం అనుసరిస్తున్నారో నాకు తెలీదు.) చివరగా పోయిన మనుషులు ఇంకా నువ్వు లేవవేం? అన్నట్లు నన్ను చూస్తూ వెళ్ళారు.

ఏది ఏమైనా నేనుమాత్రం అర్జునరావుగారితో మాట్లాడకుండా వెళ్ళదలుచుకోలేదు ఆరోజు.

* * *

గడియారం ఎనిమిది కొట్టగానే చేతిలో ఉన్న వారపత్రికను ప్రక్కనున్న టీపాయి మీద పడేసి అంతఃపురంలోకి నడుస్తారు అర్జునరావు గారు.

ఆ రోజున నేనింకా కదలకుండా కూచొని

ఉన్నందుకే కాబోలు ఎనిమిది దాటినా పత్రికలోంచి ముఖం బయటికి తియ్యలే దాయన!

హాలు నిర్మానుష్యమైంది. అర్జునరావు గారు, నేను తప్ప హాల్లో ఎవరూలేరు. మరో పదినిముషాలు గడిచిం తరువాత ఇక లాభం లేదనుకున్నారేమో పత్రిక టీపాయిమీద పారేసి పేము కుర్చీలోంచి లేవబోయా రాయన నకిలిస్తూ.

"సార్" అన్నాన్నేను.

ఏమిటన్నట్లు ప్రశ్నార్థకంగా నన్ను చూస్తూ కూచుండి పోయారాయన.

ఆ క్షణంలో నన్ను నేను మరిచిపోయాను. నా ఆవేశం కట్టలు తెంచుకొంది.

"ప్రతి రోజూ తమకు నా కష్టం చెప్పుకోవాలని మీ దగ్గర కొస్తున్నాను. నా కవకాశం దొరకలేదు. ఎందరో మీ దగ్గర కొచ్చి ఆశతో తమ సమస్యలను నివేదించుకుంటున్నారు. తమరు మాత్రం ఎవర్నీ పట్టించుకోకుండా పత్రికా పఠనంలో తల మునకలవుతున్నారు. వచ్చిన వారిని కనీసం 'రా', 'కూచో' అనైనా పలకరించకూడదా? వాళ్ళ సమస్యలు పరిష్కరించినా, పరిష్కరించకపోయినా కాసింత సానుభూతితో వాళ్ళ మాటలు వినలేరా? మీరు ప్రజా ప్రతినిధులు. మీ మీద ఎన్నో ఆశలు పెట్టుకొని వస్తున్నారు వారు. మీ ప్రజల పట్ల మీరింత నిర్లక్ష్యంగా ఉండటం న్యాయమేనా? ప్రజలన్నా, ప్రజా సేవ అన్నా ఇంత విముఖత చూపుతున్న మీరు తగుదునమ్మా అని ఎన్నికల్లో పోటీ చెయ్యటమెందుకు? అది చేస్తాం, ఇది చేస్తాం అని శుష్క వాగ్దానాలు చేయ్యటమెందుకు? మరెవరికైనా ఆ అవకాశం ఎందుకు దక్కనివ్వరు? మిమ్మల్ని నమ్ముకున్న ప్రజల్ని నట్టేట్లో ముంచడం ధర్మమా? మీరు కేవలం మీ సుఖ సంతోషాలకే పాటుబడుతున్నారు గాని ప్రజల కోసం ఏం చేస్తున్నారు? జనం హాహాకారాలతో అలమటించి పోతూ ఉంటే మీరు దివ్యభవనంలో పేము కుర్చీల్లో పేపరు చదువుకుంటూ హాయిగా కూచుంటారా? ఆ పేపర్లలో మాత్రం ఏమున్నది ప్రజల ఆర్తనాదాలు తప్ప! మీరు ప్రజలకు, ప్రజాస్వామ్యానికి ఎంత ద్రోహం చేస్తున్నారో కొంచమయినా ఆలోచిస్తున్నారా..."

ఎక్కణ్ణుంచి వచ్చిందో ఆ ధైర్యం! పెద్ద ప్రతిపక్ష నాయకుడిలా ఉపన్యాసం దంచేశాను.

అత్యాశ్చర్యకరంగా అర్జునరావు గారికి కోపం రాలేదు. ఆయన పెద్దపెట్టున నవ్వారు. దగ్గరకు రమ్మని చేత్తో సెగ చేసి ప్రక్కన కూచోమని కుర్చీ చూపించారు.

ఆయన చెప్పినట్లు చేశాను చేష్టలుడిగి.

"మీరు ప్రజా సేవ ఎందుకు చెయ్యరని, ప్రజా సేవ చెయ్యని మీరు ప్రతిసారీ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేస్తున్నారని, శుష్క వాగ్దానాలు ఎందుకు చేస్తున్నారని అడుగుతున్నావు. నీ ఆవేదన నా కర్థమైంది. పంటరిగా ఉన్నావు కాబట్టి నీకు కొన్ని నిజాలు చెబుతాను విను. ఈ విషయాలు అందరికీ తెలిస్తే రేపటినుంచి ఈగ కూడా నా ఇంటి ముందుకు రాదు. అలాంటి పరిస్థితే వస్తే నా బ్రతుకు దుర్భరమవుతుంది." నిట్టూర్చా రాయన.

"గడిచిన పదిహేనేళ్ళుగా నేనే ఎం.ఎల్.ఎ.గా అవిచ్ఛిన్నంగా ఎన్నికవుతూ ఉన్నాను. డజన్ల కొద్దీ ముఖ్యమంత్రులు, స్కోర్ల కొద్దీ మంత్రులు అడ్రెస్ లేకుండా పోయారు గాని నేను మాత్రం ఇలాగే కొనసాగుతున్నాను. మెన్ మే కం అండ్ మెన్ మే గో బట్ ఐ గో ఆన్ ఫరెవర్." తృప్తిగా గాలి లోపలికి పీల్చుకొని మీసాలు సరిజేసుకున్నారు.

"ప్రజా సేవకు పూనుకొని ఉంటే నాకూ వాళ్ళ గతే పట్టి ఉండేది."

'అర్జునరావు గారేనా మాట్లాడుతున్నది? ఇంత సౌమ్యుడా ఇతను' లోలోపల ఆశ్చర్యపోతున్నాన్నేను.

"ఎం.ఎల్.ఎ. ఏం సమస్యలు పరిష్కరించగలడు చెప్పు. ఏమధికారాలున్నా యతనికి? మొదట్లో పిచ్చిగా ఏదో చెయ్యాలని నేనూ ప్రయాసపడ్డాను నిజంగా. ఊరికో కాలేజి తేవాలని ప్రారంభించి సింగిల్ టీచరు స్కూలు కూడా తేలేకపోయాను. హాస్పటల్ ఇస్తేగాని కాదని పట్టుబట్టి మంత్రసాని నయినా వేయించుకోలేకపోయాను. రోడ్డు వేయించాలనే ప్రయత్నంలో బండ్లబాటను గ్రామస్థుల సాయంతో బాగు చేయించాను. ఆ పని నా కారు రాకపోకల కోసమే చేయించుకున్నానే విమర్శ ఉందనుకో. అది వేరే విషయం. ఒక చిన్న పరిశ్రమయినా ఊళ్ళో పెట్టిస్తే పది మందికి ఉపాధి దొరుకుతుందనే ఆశతో కనీసం కమ్మరి కొలి మయినా పెట్టించలేకపోయాను. ఊరికి కరెంటు సంపాదించాలనుకొని ఉన్న కిరోసిన్ దీపాలు పోగొట్టుకునేలా చేశాను."

అర్జునరావు గారి ముఖంలో విషాదం చోటు చేసుకున్నది.

"వందల కొద్దీ మనుషులు ఉద్యోగా లిప్పించమంటూ వచ్చారు. ఒక్కరికీ నా మూలంగా అది లభించలేదు. ఒకసారి ఒక గ్రామ సేవిక ట్రాన్స్ఫర్ ఇప్పించమంటూ ప్రాధేయపడింది. నా శక్తికి మించిన పనయిం దది. మాప్రాపాయలు నావి కాదనుకొని ఆవిడే తన పని సాధించుకొన్నది. ఆ పని జరిగిం తరువాత ఆవిడ హేళనగా నన్ను చూచినప్పుడు నా గుండెల్లో ఎంత పదునైన బాకులు దిగాయో ఏం చెప్పను!"


అర్జునరావు గారి గుండెలో కూడా అగ్ని పర్వతాలున్నాయన్న మాట. ఆయన పట్ల సానుభూతి ఏర్పడింది నాకు.

"ఇప్పుడన్నిటికీ స్వస్తి చెప్పి ఇలా కూచుంటున్నాను. ప్రాణానికి చాలా హాయిగా ఉంది. వచ్చిన వారిని పలకరించడం, మర్యాదలు చెయ్యడం ఆరంభిస్తే వాళ్ళు నన్నొదిలిపోరు. నాకు ప్రశాంతత ఉండదు. నేనేం చెయ్యకపోయినా జనం ఎలా వస్తున్నారో చూచావుగా! నేను ప్రజా సేవ చెయ్యకపోవడానికి కారణం అర్థమైందనుకుంటాను. అసలు నేను ఎన్నిక కావడానికి కారణం నా ప్రజా సేవ కాదు. అభ్యుదయ భావాలు కాదు. గూండాగిరి. కులం, మతం, ఏవీకాదు. వాటివల్ల పదవులు అలంకరిస్తున్న వారు లేరని కాదు నా ఉద్దేశం. నా విషయం మాత్రం చెబుతున్నాను. మాది జమీందారీ వంశం. అంటే నిజంగా జమీందార్లం కాదు. కొన్ని వందల ఎకరాల భూమి ఉండేది మాకు. చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న భూములన్నీ ఒకప్పుడు మావే. ఇప్పుడు భూపరిమితి చట్టాలొచ్చి అన్నీ కుదించుకుపోయాయనుకో. ఈ ప్రాంతంలో ఉన్న ప్రజానీక మంతా మామీద ఆధారపడి బ్రతికిన వారే. కాదు, కాదు. వాళ్ళ కష్ట ఫలితాన్నే అనుభవిస్తూ తరతరాలుగా అష్టయిశ్వర్యాలు అనుభవిస్తూ వచ్చాము మేము. వాళ్ళు, వాళ్ళ శ్రమ ఫలితమూ లేకపోతే మేమిలా ఉండగలిగే వాళ్ళం కాదు. పాపం వాళ్ళకీ విషయాలన్నీ తెలీవు."

అర్జునరావుగారి పట్ల నా కపారమైన గౌరవం ఏర్పడుతున్నది. ఆయన హృదయ వైశాల్యాన్ని అభినందించకుండా ఉండలేక పోయాను.

"నిజానికి మేము ప్రజలందరికీ వంశ పారంపర్యంగా కృతజ్ఞులమై ఉండాలి. మా అంతరాంతరాల్లో ఉన్నాం కూడా. మనం కాలంతోబాటు బ్రతకాలి గాని దాని కంటే ముందు నడిస్తే నాశనమవుతాము. గొప్ప గొప్ప మేధావులకు పట్టిన గతి నీకు తెలును గదా! అందువల్ల మా మనోభావాలు బయటపెట్టలేదు ఎన్నడూ... ఈ ప్రజలందరికీ మామీద కృతజ్ఞత ఉన్నది, అచంచలమైన భక్తి విశ్వాసాలు ఉన్నాయి. నే నందుకే ఎన్నికల్లో నెగ్గుకొస్తున్నాను.

"మేము గౌరవ మర్యాద లందుకోటానికి అలవాటు పడ్డాం. ఆస్తులన్నీ పోయిన మమ్మల్నెవరు గౌరవిస్తారు? కాని గౌరవం కావాలని మాలోని ప్రతి అణువూ కోరుతుంటుంది. అందుకే ఏమీ చేయ్యలేనని తెలిసిం తరువాత గూడా పదవి కోసం ప్రాకులాడుతున్నాను. పట్టుకు వ్రేలాడు తున్నాను. ఈ పదవి కూడా లేకపోతే మాముఖం ఎవరు చూస్తారు?... మేమూ అందర్లో ఒకరం అయిపోమా? అది నా కిష్టం లేదు. నాకు పదవి కావాలి. పదవి ద్వారా లభించే గౌరవం కావాలి... ఇంకోళ్ళకు



అవకాశ మివ్వకుండా నేనే ఎందుకు పోటీ చేస్తున్నానో అర్థమైందను కుంటాను."

"శుష్క వాగ్దానాలంటావా!" పెద్దగా నవ్వారు అర్జునరావు గారు. "అవి లేందే పని జరగదయ్యా బాబూ! ప్రజలు వాటి కలవాటు పడిపోయారు... మకేం చేస్తావని వారి చేత అడిగించుకునే బదులు మనమే చెప్పెయ్యటం మంచిది కదూ!" మళ్ళీ నవ్వా రాయన.

"మనిషి ఆశాజీవి. ఆశల్లోనే బ్రతుకుతున్నారు మన మనుషులు. అలా బ్రతకటంలోనే ఆనందం ఉందను కుంటున్నారంతా. ప్రాక్టికాలిటీ ఎంత మంది మనుషుల్లో ఉంది! అన్నీ ప్రభుత్వం చేస్తుంది లెమ్మని ఆశపడటం తప్ప మనమూ ఏమైనా చేసుకుందా మనుకుంటున్నారా మన ప్రజలు! ప్రజలు కోరేవన్నీ ప్రభుత్వం చేస్తేగాని కాని పనులా!... ప్రజల్లో ఉన్న బలహీనతను కనిపెట్టేశారు రాజకీయ పార్టీల వాళ్ళు. అధికారంలో కొచ్చేందుకు-అధికారంలో పదిలంగా ఉండేందుకు-ఆశల అస్త్రాలనే ఉపయోగిస్తున్నారందరూ... ఇప్పుడు ప్రజలు తమ అస్తిత్వాలను, వ్యక్తిత్వాలను మరిచిపోయి అందని ద్రాక్షల కోసం మోరలు మాత్రం చాస్తున్నారు-చేతులు కాళ్ళు ముడుచుకున్నారు.

"నీ కింకో విషయం చెప్పాలి. రోజూ ఎన్ని వందల మంది నాదగ్గరికి వస్తూ పోతున్నారో చూచావు గదా. వారిలో చాలా మందికి నన్ను సొంతం చేసుకోవాలనే దురాలోచన గూడా ఉంది. అద అట్లా ఉంచు... వందల మంది వేల కోరికలను తీర్చటం నాకు సాధ్యమయ్యే పనేనా! తీరుస్తామంటూ రాజధానీ నగరానికి డబ్బుల సంచులు మోయించటం నాకిష్టం లేదు. పైగా పది మంది కోర్కెలు తీరుస్తే వంద మంది శత్రువులు తయారవుతారు నాకు."

"నే నేదో చెయ్యగల ననే నమ్మకం ఉన్నది వాళ్ళకు. అని వమ్ము కాగూడదు. అలాగే ఉండాలి. 'నేను లేస్తే మనిషిని కాదు' అనే కథ తెలుసుగా! ఆ మనిషి లేవడు. లేవలేడు. లేచేందుక్కాళ్ళు లేవు. అతని పని జరగాలంటే అతను కూచోనే ఉండాలి. అప్పుడే జనానికి అతనంటే భయం, భక్తి ఉంటుంది. నా పని గూడా అంతే. చేస్తానని వారను కోవాలి. నమ్మాలి."

అర్జునరావు గారి బాధ అర్థమవుతున్నది.

"శాసనసభ్యులుగా మాపని శాసనాలు చెయ్యటమే. ప్రతి శాసనం సభలో ప్రవేశపెట్టినప్పుడు విధిగా చేతులెత్తి మావిద్యుక్త ధర్మాన్ని నెరవేరుస్తున్నాం. అది కాకుండా ఇంకా ఏవేవో చెయ్యాలని అనటం, అనుకోవటం, ధర్మమా? నా నియోజకవర్గాన్ని గురించి మాట్లాడట మంటావా! అవకాశ మొచ్చినప్పుడు ఏవో చెపుతూనే ఉన్నాము.

"ఈ వ్యవస్థలో మకుగా మేము ఏమీ చెయ్యలేక పోతున్నాము. మహా అయితే పార్టీలు మారుస్తున్నాము-అందువల్ల లాభపడట మంటావా-ఊరికే ఉండటమెలా? పని చేసి లాభపడక పోతే ఎలా?

"మేం కావాలనే పనులు ఎవరూ చెయ్యరు. మతో మాట్లాడేందుకే అయిష్టపడుతారు కార్యనిర్వాహకులు. మా వల్ల వాళ్ళ ఇంటరెస్టులు దెబ్బ తింటున్నవని వారి బాధ!...

"'ఫలానా వారు ఏ పనయినా కావాలని వస్తే చెయ్యవద్దు' అనే రహస్య ఆదేశాలు-ఇదంతా రాజకీయం...కుళ్ళు." నిట్టూర్చారు అర్జునరావుగారు.

"టైము చాలా అయినట్లున్నది... ఇంతకూ నువ్వు వచ్చిన పనేంటి? నేనే విధంగా నీకు సహాయపడగలను?" అప్యాయంగా అడిగారు.

నా సమస్యతో ఆయన్ను బాధపెట్టదలచుకోలేదు. నా మనసు మార్చుకున్నాను. నా కష్టమేదో నేనే పడదలుచుకున్నాను.

"ఏం లేదు. ఊరికనే వచ్చాను. మీతో మాట్లాడాలనే ఆసక్తితో ఇంత సేపూ కూచున్నాను. మీకు శ్రమ కలిగించాను. క్షమించండి" అంటూ లేచాను.


"నో నో. శ్రమేం లేదు. నేనూ మనిషినే. ఆలోచనలు నాకూ ఉన్నాయి. నాలోనూ చైతన్యం ఉన్నది. నా మనసు విప్పి చెప్పుకునేందుకు మంచి అవకాశం కలిగించావు. థాంక్యూ! నా పరిస్థితి అర్థమైంది కదా?"

"అర్థమైంది. నాకు శలవిప్పించండి" అంటూ నమస్కారం పెట్టి అక్కడి నుండి బయలు దేరాను.

సింహద్వారం దాకా వచ్చి సాగనంపారు అర్జునరావుగారు. "అప్పుడప్పుడు వస్తూ వుండు. బట్ కమ్ ఆఫ్టర్ ఎయిట్ ప్లీజ్." నవ్వుతూ అని వెనక్కు తిరిగారు.

"అలాగే" అంటూ త్రోవనపడ్డాను చీకట్లో

*




నవజ్యోతి
నవనవలా వల్లి!
నూతన సంవత్సర శుభాకాంక్షలతో

శ్వేత నాగు-2 ... లల్లాదేవి ............ రూ.13/-
పవిత్ర ... ఎ. శ్యామలా రాణి ............ రూ.20/-
(ఆంధ్రప్రభ వార పత్రిక సీరియల్)
కాంట్రాక్ట్ పెళ్ళి ... జొన్నలగడ్డ లలితాదేవి ...... రూ.15/-
సంధ్యా సాగర సంగమం ............ రూ.13-50
పాటిబండ్ల విజయలక్ష్మి
శిలలు సెలయేళ్ళు ... పోలప్రగడ రాజ్యలక్ష్మి .... రూ.16/-
సిద్ధార్థ ... కోడూరి శారదాదేవి ............ రూ.16/-

మీ దగ్గర బుక్ స్టాల్‌లో అడగండి!
లేదంటే నేరుగా M.O పంపుతూ మాకు వ్రాయండి!!

నవజ్యోతి పబ్లికేషన్స్
ఏలూరు రోడ్
విజయవాడ-520 002